నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్‌లో చేరికలు

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని 14వ వార్డుకు చెందిన 30 మంది బీజేపీ కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. -మక్తల్

బిగాల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నిజామాబాద్ నగరంలోని 35వ డివిజన్‌కు చెందిన నరేశ్‌తోపాటు వంద మందికిపైగా యువకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. -కంఠేశ్వర్

కేసీఆర్, కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు కరీంనగర్ జిల్లా వీణవంక బస్టాండ్ ఆవరణలో గురువారం దళితసంఘ నాయకులు క్షీరాభిషేకం చేశారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపడానికి కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేసుకున్నారు. -వీణవంక

అంతా తిరుపతిరెడ్డే చూసుకుంటున్నడు!

- ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్ సోదరుడు
- దుద్యాలలో అన్నీ తానై సందడి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ,
- అభివృద్ధి పనులు ప్రారంభించిన తిరుపతిరెడ్డి

దుద్యాల ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 30 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హవా కొనసాగుతున్నది. ఈనెల 26న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గాన్ని తిరుపతిరెడ్డి చూసుకుంటారని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆయనకు ఎలాంటి రాజ్యాంగపరమైన పదవి లేకపోయినా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. గురువారం దుద్యాలలో ఏర్పాటు చేసిన ఎంపీడీవో కార్యాలయాన్ని తిరుపతిరెడ్డి ప్రారంభించారు. పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులతోపాటు కొడంగల్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, దుద్యాల ఇన్‌చార్జి ఎంపీడీవో మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఆటోకార్మిక సంఘాల నేతలు

కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం

- బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ నిండా ముంచిందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ సమావేశం గురువారం నిర్వహించారు. మారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. సమావేశంలో రాంబాబు యాదవ్, పీ నారాయణ, మహేశ్ దేశపాక్, రంగారెడ్డి, పరుశురాం యాదవ్, నిరంజన్ పాల్గొన్నారు.

అటు మార్షల్స్.. ఇటు పోలీస్

మొదటిపేజీ తరువాయి...

ముగిసింది. చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10:35 గంటలకు ప్రారంభమైన జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశం.. ఆందోళనలు, ప్లకార్డుల చించివేతలు, కార్పొరేటర్ల అరెస్టులు, భిక్షాటనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలతో హోరెత్తింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్‌టాటా మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు సభ మౌనం పాటించి నివాళులర్పించింది.

చర్చ లేకుండానే బడ్జెట్‌కు ఆమోదం

ఆనంతరం షెడ్యూల్ ప్రకారం ముందుగా ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8,440 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి, దానిపై చర్చించాల్సి ఉన్నది. కానీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎలాంటి చర్చ జరగకముందే బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు ఆరు గ్యారెంటీలను ఆమలుచేయాలని, హైదరాబాద్ నగరానికి సరిపడా నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్లకార్డులతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో మేయర్ ఆదేశాల మేరకు నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు సింధూ ఆదర్శరెడ్డి, విజయశాంతి, విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డిని మార్షల్స్ బలవంతంగా బయటకు పంపించగా, పోలీసులు వారిని అరెస్టు చేసి ట్యాంక్‌బండ్ చుట్టూ తిప్పి జీహెచ్ఎంసీ ఆవరణలో వదిలిపెట్టారు. అనంతరం లోపలికి వచ్చేందుకు ఆ నలుగురు కార్పొరేటర్లు తిరస్కరించారు. మేయర్ విజయలక్ష్మి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. మిగతా కార్పొరేటర్లు నిరసన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేతిలో ఉన్న ప్లకార్డులను కాంగ్రెస్ కార్పొరేటర్లు లాక్కొని చించేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు మార్షల్స్ అవతారం ఎత్తి బీఆర్ఎస్ కార్పొరేటర్లపై విరుచుపడ్డారు. మహిళా కార్పొరేటర్లను సైతం నెట్టేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సభ్యులను మార్షల్స్ సహకారంతో మేయర్ బయటకు పంపించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను పోలీసులు ఈడ్చుకుంటూ అరెస్ట్ చేసి రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద తదితరులు రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బీఆర్ఎస్ కార్పొరేటర్లకు సంఘీభావం తెలిపారు.

చూస్తూ ఊరుకోం: తలసాని

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను బయటకు పంపి బడ్జెట్‌ను ఆమోదించడం దుర్మార్గమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. ఎలాంటి చర్చ జరగకుండానే బడ్జెట్‌ను ఆమోదించడం సరికాదని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సభ్యుడిని బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు

గొంతునొక్కాలని చూస్తే సహించం: మహమూద్ అలీ

నగర సమస్యలపై చర్చించాలని కోరిన కార్పొరేటర్లను అరెస్ట్ చేయడం సబబుకాదని ఎమ్మెల్సీ మహమూద్ అలీ మండిపడ్డారు. కాంగ్రెస్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, మాటలు తప్ప అభివృద్ధి చేయడంలేదని విమర్శించారు.

ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్‌కు గుణపాఠం: వివేకానంద

ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మండిపడ్డారు. ప్రజా సమస్యలపై సభలో చర్చించకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కార్పొరేటర్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్పొరేటర్ల అరెస్టు అమానుషం: కాలేరు వెంకటేశ్

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజల పక్షాన మాట్లాడిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేయడం అమానుషమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విమర్శించారు. నగరంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు.

కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి నిదర్శనం: హరీశ్‌రావు

జీహెచ్ఎంసీ పాలక మండలిలో ప్రశ్నించిన బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్టు పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కార్ నిరంకుశ వైఖరికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా? రాష్ట్రానికి గుండెకాయలాంటి హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా? అని మండిపడ్డారు. బడ్జెట్ మీద చర్చ లేకుండానే అమోదిస్తున్నట్టు ప్రకటించడం అప్రజాస్వామికమని దుయ్యబట్టారు. ప్రజల తరుపున ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలను చేయకుండా అరెస్టుల పేరుతో ప్రజాప్రతినిధులను అణగదొక్కాలని చూస్తే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పాలకమండలిలో ప్రశ్నించినా అరెస్టులా?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో ఎండగట్టినందుకు కార్పొరేటర్లను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని నగర ప్రజల తరపున ప్రశ్నిస్తే బయటకి గెంటేస్తారా? అని మండిపడ్డారు. గత సంవత్సరపు బడ్జెట్ నిధులను కనీసం కూడా ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాలపై అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు తమ ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? అని ప్రశ్నించారు. ప్రజా సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదని దుయ్యబట్టారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. హామీలను అమలను చేయకుండా అరెస్టుల పేరుతో ప్రజాప్రతినిధులను అణగదొక్కాలని చూస్తే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

హిమాచల్ హైడ్రో ప్రాజెక్టులపై ఆసక్తి

- ఎంఓయూ కోరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): హిమాచల్ ప్రదేశ్‌లో 100 మెగావాట్లకు పైబడి సామర్థ్యం గల హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై తెలంగాణ ఆసక్తి వ్యక్తంచేసింది. ఈ మేరకు గురువారం హిమాచల్‌ప్రదేశ్ సీఎం సఖుతో డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరురాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్‌ప్రదేశ్ సీఎంను కోరారు.

అధికారులపై ఉత్తమ్ ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): ఎన్నిసార్లు ఆదేశించినా సొంత నియోజకవర్గంలోనే పనులు మొదలు పెట్టకపోతే ఎలా? ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటి అంటూ ఇరిగేషన్‌శాఖ అధికారులపై సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లాలో పలు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సంబంధించిన పనులను ఇప్పటికీ అధికారులు గ్రౌండింగ్ చేయకపోవడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఎలా? అంటూ నిప్పులు చెరిగారు.

ప్రొఫెసర్ల రిటైర్డ్ వయస్సు 65 ఏండ్లకు పెంపు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ రివైజ్డ్ పేస్కేల్‌ను అనుసరించి రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో యూజీసీ వేతన స్కేల్ పొందుతున్న అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వం 60 నుంచి 65 ఏండ్లకు పెంచింది. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా జీవోతో ప్రొఫెసర్లు ఇకపై 65 ఏండ్లకు పదవీ విరమణ పొందనున్నారు.

కాంగ్రెస్ పోల్.. సెల్ఫ్‌గోల్

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తావించకుండా.. ఫాంహౌస్ పాలన కావాలో, ప్రజల వద్దకు పాలన కావాలో తేల్చి చెప్పాలని కోరింది. రెండు ఆప్షన్స్‌తో 24 గంటల గడువుతో ఆన్‌లైన్ పోలింగ్ నిర్వహించింది. బీఆర్ఎస్ పాలన అనే ఉద్దేశంతో 'ఫాంహౌస్ పాలన' అని, అట్లాగే కాంగ్రెస్ పాలన అనే ఉద్దేశంలో 'ప్రజల వద్దకు పాలన' అనే అప్షన్స్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారిక ఖాతాలో పిన్ చేసిన పెట్టిన ఆ పోల్ బుధవారం రాత్రి వరకు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు ఎక్కువగా ఉండే ఈ ఖాతా ద్వారా ఆన్‌లైన్ పోలింగ్ నిర్వహిస్తే.. ట్రెండింగ్‌లో ప్రభుత్వానికి అనుకూల ఓట్లు వస్తాయని, ఈ ఫలితాలను హైలైట్ చేయటం ద్వారా ప్రభుత్వ పాలనకు ప్రజలు మద్దతు ఉందని ప్రచారం చేసుకునేందుకు వీలవుతుందని కాంగ్రెస్ రాజకీయ వ్యూహకర్త స్కెచ్ వేశారు. కానీ అంతా తలకిందులైంది. జనం వేల సంఖ్యలో ఆ ఓటింగ్‌లో పాల్గొని 420 రోజుల పాలనపై కుండబద్దలు కొట్టారు. పోల్ మొదలైన మొదటి నాలుగు గంటల్లోనే 15,815 మంది నెటిజన్లు ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్దేశాన్ని పసిగట్టిన ప్రజలు 74 శాతం మంది నిర్మొహమాటంగా 'నిండా ముంచిన ప్రజాపాలన కన్నా ప్రజల గురించి ఆలోచించిన ఫాంహౌస్ పాలనే మేలు' అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పాలనపై జనం తీవ్రస్థాయిలో విరుచుకుపడటంతో అప్రమత్తమైన కాంగ్రెస్.. ఆ పోల్‌లో కామెంట్లను ఆఫ్ చేసేసింది.

అన్‌పిన్ చేసినా.. ఆగని నెటిజన్లు

ఆన్‌లైన్ పోలింగ్‌లో తమకు ప్రతికూల ఓట్లు నమోదు అవుతుండటంతో టీపీసీసీ అలర్ట్ అయ్యింది. ఫలితం బీఆర్ఎస్ వైపే వస్తుండటంతో తన సోషల్‌మీడియా టీములను, కనుగోలు బృందాలను అప్రమత్తం చేసింది. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన, జాతీయస్థాయిలో నడుస్తున్న పార్టీ హ్యాండిల్స్ సాయం కోరింది. బాట్, ఫేక్ అకౌంట్లతో ఓటింగ్‌ను తనకు అనుకూలంగా మార్చేసేందుకు శతవిధాలా ప్రయత్నించింది. పొరుగు రాష్ట్రం మిత్రుల సహకారమూ తీసుకున్నది. గురువారం ఉదయం నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, సోషల్‌మీడియా వర్కర్లను రంగంలోకి దించినట్టు, ప్రత్యేక క్యాంపెయినింగ్‌తో దాదాపు 300 మందితో ఏకకాలంలో ప్రమోషన్ వర్క్ మొదలుపెట్టినట్టు తెలిసింది. ఫేక్ ఐడీలు ఓపెన్ చేసి ట్వీట్లు, రీట్వీట్లతో దాదాపు 5 గంటలపాటు కుస్తీ పడితే.. సరిగ్గా 2.09 గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ పోలింగ్ శాతం అతి స్వల్పంగా మెరుగుపడ్డది. ఈ సమయంలో 65,387మంది నెటిజన్లు ఓటింగ్‌లో పాల్గొనగా..64 శాతం మంది బీఆర్ఎస్ పాలనకు అనుకూలంగా ,36 శాతం మంది కాంగ్రెస్ పాలనకు అనుకూలంగా ఓటు వేశారు. ఈ ఆన్‌లైన్ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి పోలైన అతిపెద్ద పోలింగ్ శాతం ఇదే కావటం గమనార్హం. ఇక ఆ తరువాత నుంచి బీఆర్ఎస్ అనుకూల ఓటింగ్ శాతం క్షణ క్షణానికి పెరుగుతుండటంతో కాంగ్రెస్ నేతలు చేతులెత్తేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తిగా తమ చేతిలోంచి వెళ్లిపోయిందని నిర్ధారణకు వచ్చిన కాంగ్రెస్ నేతలు తాము పెట్టిన పోస్టు సోషల్ మీడియాలో హైలైట్ కాకుండా అన్‌పిన్ చేశారు. అయినా కూడా నెటిజన్లు భారీ ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. పోస్టు అన్‌పిన్ చేసిన తరువాత కూడా కేసీఆర్ పాలనకు అనుకూలంగా ఓటింగ్ శాతం పెరుగుతూనే వచ్చింది. జనంలో గూడుకట్టుకున్న ప్రభుత్వ వ్యతిరేకత ముందు కాంగ్రెస్ ప్రయత్నాలన్నీ తేలిపోయాయి. పోల్ ముగిసేనాటికి మొత్తం 92,551మంది ఓటు వేయగా.. 67శాతం మంది కేసీఆర్ పాలనకు మద్దతుగా నిలిచారు.



ఆర్-టీవీ లైవ్ పోలింగ్‌లోనూ అదే జోరు

కాంగ్రెస్ పోల్ పోస్టును డిలీట్ చేసిన తర్వాత పలు సోషల్‌మీడియా ఖాతాలు, శాటిలైట్ చానళ్లు అదే పోల్‌ను తమ తమ వేదికలపై కొనసాగించాయి. ఆర్-టీవీ అనే వెబ్ చానల్ ఇదే అంశంపై డిబేట్ నిర్వహించింది. 'నిజంగానే మీరు ఫాంహౌస్ పాలననే కోరుకుంటున్నారా?' అనే ప్రశ్నతో లైవ్ పోలింగ్ నిర్వహించింది. ఈ పోలింగ్‌లోనూ ప్రేక్షకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. టీవీ కార్యక్రమం 43వ నిమిషం వద్ద 3,278 మంది ప్రేక్షకులు ఓటింగ్ చేయగా.. 78 శాతం మంది బీఆర్ఎస్ పాలనకు అనుకూలంగా ఓటు వేశారు. కేవలం 22శాతం మంది మాత్రమే రేవంత్‌రెడ్డి పాలనను సమర్థించారు. 43వ నిమిషం తర్వాత ప్రతి సెకనుకు 200 మంది చొప్పున ఓటింగ్‌లో పాల్గొన్నారు. షో ముగిసే సమయానికి 11,066 మంది ప్రేక్షకులు ఓటు వేయగా 81 శాతం మంది కేసీఆర్ పాలనను, కేవలం 19 శాతం మంది రేవంత్ పాలనను సమర్థించారు.

ఫార్మర్‌హౌస్ పాలనే కావాలి

కేసీఆర్ పరిపాలనను కాంగ్రెస్ నేతలు ఫాంహౌజ్ పాలన అంటూ వ్యంగ్యంగా తక్కువ చేసి చూపుతూ చేసిన ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టారు. 'సారే మళ్లీ రావాలి.. తెలంగాణను ఏలాలి' అని ముక్తకంఠంతో నినదించారు. 'ఇందులో వెతుక్కోవటానికి లాజిక్‌లు ఏమీ లేవు.. అది ఫాంహౌస్ కాదు.. ఫార్మర్‌హౌస్ పాలన. వ్యవసాయ క్షేత్ర పాలన కాదది.. క్షేత్రస్థాయి పాలన. మాకదే కావాలి' ఓ నెటిజన్ వ్యాఖ్యానించారు. తన పాలనపై తానే ప్రజాభిప్రాయం కోరి.. కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్ చేసుకోవడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ నిర్వహించిన ఈ పోల్.. పూర్తికాకముందే రద్దు చేసుకున్న తీరు.. ప్రజాతీర్పు.. ఇవి జాతీయస్థాయిలో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నేషనల్ మీడియా సైతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిన తీరుపై కథనాలు ప్రసారం చేశాయి.

సమాధానం చెప్పుకోలేక మల్లగుల్లాలు

తన పాలనపై తానే రెఫరెండం పెట్టుకుని, జాతీయస్థాయిలో తన పరువు తానే తీసుకున్న కాంగ్రెస్.. నష్టనివారణ చర్యలకు దిగింది. పోల్ ఫలితంపై కవరింగ్ మొదలుపెట్టింది. ఓటేసిన ప్రజలను, తెలంగాణవాదుల్ని, నెటిజన్లందరినీ బీఆర్ఎస్ సోషల్‌మీడియాగా జమకట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. పైగా ఫేక్ అకౌంట్లతో ఫలితాన్ని మార్చారంటూ కొత్త రాగం ఎత్తుకున్నది. తమ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను విస్మరించి.. తమ పార్టీ సోషల్ మీడియా విభాగం వీక్‌గా ఉన్నదంటూ సాక్షాత్తు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మీడియా సమావేశం పెట్టి మరీ వివరణ ఇచ్చుకోవడం గమనార్హం. ప్రజలెవరూ ఫాంహౌస్ పాలనను కోరుకోవడం లేదని, మానిప్యులేషన్ సర్వేలు జరుగుతున్నాయంటూ ముక్తసరిగా చెప్పి వెళ్లిపోయారు.

రైతులను ఓదార్చితే మీకేం బాధ?

మొదటిపేజీ తరువాయి...

సభ్యులు, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, జోగు రామన్న, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నాయకులు దేవీప్రసాద్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, రాజపర్రప్రసాద్, కిశోర్‌గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గాలి మాటలు, ఢిల్లీకి మూటలు తప్ప 14 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో పాలన రోజుకో గండంలా మారిందని మండిపడ్డారు.

నిరాశ, నిస్పృహల్లో రైతులు

పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేక రైతులు తల్లడిల్లుతున్నారని నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. అచ్చంపేట, గద్వాల, మెదక్ ప్రాంతాల్లో మిర్చి, వేరుశనగ రైతులు రోడ్డెక్కుతున్నారని, పత్తి రైతులు రోడ్డెక్కి అలిసిపోయారని వాపోయారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకాక, రుణమాఫీ జరగక, రైతుబంధు రాక, బోనస్ లేక, మద్దతు ధర అందక, కరెంటురాక, సాగునీళ్లు అందక రైతులు ధైర్యం కోల్పోయి నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కాంగ్రెస్ పార్టీకి సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను కలిసి ఓదార్చి కొంత సహాయం అందించినట్టు తెలిపారు. ఢిల్లీకి, విదేశాలకు తిరిగే సీఎంకు, హెలికాప్టర్లలో తిరిగే మంత్రులకు రైతులను పరామర్శించే తీరిక లేదా? అని ప్రశ్నించారు.

> గాంధీజీ వారసులమని చెప్పుకొని తిరిగే కాంగ్రెస్ నాయకులు ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. అబద్ధాలు చెప్పొద్దని, సత్యమే పలకాలని గాంధీజీ బోధించారు. కానీ, రోజూ అబద్ధాలు చెప్పడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు గాంధీ వారసులు ఎలా అవుతారు. - నిరంజన్‌రెడ్డి

6% మందికే రైతుభరోసా

జనవరి 26న రైతుభరోసా జమ చేస్తామని తొలుత చెప్పి, 15 నిమిషాల్లోనే మార్చి 31 వరకు వేస్తామంటూ మాట మార్చారని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో 12,995 గ్రామాలు, 70 లక్షల రైతులు ఉంటే, 561 గ్రామాల్లోని 4.42 లక్షల మంది (6%)కే రైతుభరోసా వేశారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోతు తెలియక ఎన్నికల్లో హామీలు ఇచ్చినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం మాట్లాడకుండా స్పీకర్‌తో ఎందుకు మాట్లాడిస్తున్నరని ప్రశ్నించారు. 40 లక్షల మంది రైతు కూలీలు ఉంటే 20 వేల మందికే ఆత్మీయ రైతుభరోసా ఇచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలన 'ఊరికి ఒక కోడి ఇంటికి ఒక రెక్క అన్నట్టుగా ఉన్నది' అని ఎద్దేవాచేశారు.

కేసీఆర్ హయాంలో సాగుకు 4 లక్షల కోట్లు

'కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఇచ్చాం. 1.15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల రైతుబీమా చెల్లించాం. 28,275 కోట్ల రుణమాఫీ చేశాం. రూ.65 వేల కోట్ల మేర కరెంటు రాయితీ ఇచ్చాం. ప్రాజెక్టులకు 2.37 లక్షల కోట్లు .. మొత్తంగా వ్యవసాయరంగానికి రూ.4,08,900 కోట్లు ఖర్చు చేశాం' అని నిరంజన్‌రెడ్డి వివరించారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను తలదన్నేలా చేశారని, 40 వేల ఎకరాల్లో ఉన్న ఆయిల్ పామ్ సాగును 2 లక్షల ఎకరాలకు దాటించారని తెలిపారు. రైతులకు ధైర్యం ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు